ఈనాడు
epaper.eenadu.net



# 'విమానాశ్రయ మెట్రో' రేసులో ఎల్ అండ్ టీ, ఎన్‌సీసీ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న విమానాశ్రయ మెట్రో ప్రాజెక్టుకు రెండు బిడ్లు మాత్రమే దాఖలు అయ్యాయి. రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 31 కి.మీ.ల ఎయిర్‌పోర్ట్ మెట్రో ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) కాంట్రాక్టర్ ఎంపికకు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) గ్లోబల్ టెండర్లను ఆహ్వానించగా ఎల్ అండ్ టీ, ఎన్‌సీసీ మాత్రమే పోటీపడ్డాయి. తక్కువ బిడ్లు దాఖలవడంతో జులై 5తో ముగిసిన టెండర్ గడువును వారం పాటు పొడిగించారు. ఈ గడువు బుధవారం ముగియగా ఇంకెవరూ బిడ్లు దాఖలు చేయలేదు. ఈమేరకు బేగంపేటలోని మెట్రోరైలు భవన్‌లో గురువారం బిడ్లను తెరిచారు. రూ.5,688 కోట్ల ప్రాజెక్టుకు సంబంధించి ఆమలు అనుభవం, సాంకేతికత, ఆర్థిక బలాలు, ఆడిట్ చేసిన నివేదికలను ఎల్ అండ్ టీ, ఎన్‌సీసీ సమర్పించాయి. రూ.29 కోట్ల బ్యాంకు గ్యారంటీలను కూడా ఇచ్చాయి. ఈ రెండు సంస్థలకు సంబంధించిన వివరాలను ఎయిర్‌పోర్ట్ మెట్రో రైలు సంస్థ నియమించుకున్న జనరల్ కన్సల్టెంట్, సీనియర్ సాంకేతిక అధికారులు క్షుణ్నంగా పరిశీలించనున్నారు. ఈమేరకు బిడ్ల మూల్యాంకనానికి పది రోజులు పడుతుందని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. అనంతరం తమ సిఫార్సులను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు వెల్లడించారు. టెండర్లు ఈ నెలాఖరు నాటికి ఖరారయ్యే అవకాశం ఉంది.

- మెట్రో టెండర్లను రూ.2 లక్షలు వెచ్చించి పలు ఇన్‌ఫ్రా సంస్థలు కొనుగోలు చేశాయి. పదికి పైగా సంస్థలు., జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో కూడిన కన్సార్షియంలు ప్రీ బిడ్ సమావేశానికి హాజరయ్యాయి. టెండర్లు మాత్రం రెండు సంస్థలే దాఖలు చేశాయి. ఈ గ్లోబల్ టెండర్లకు పెద్దగా స్పందన లేకపోవడానికి మెట్రో అధికారులు కారణాలను వివరించారు. అత్యాధునిక సాంకేతికతలను టెండర్ డాక్యుమెంట్‌లో చేర్చడం, అధిక సాంకేతిక ప్రమాణాలు, 36 నెలల్లో ప్రాజెక్ట్ పూర్తిచేయాలనే కఠినమైన గడువు, పెరిగితే రూ.500 కోట్ల వరకు జరిమానా చెల్లించాలనే నిబంధనలేనని చెప్పారు. నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత కారణంగా కూడా ఎక్కువ సంస్థలు రాలేదని మెట్రో వర్గాలు తెలిపాయి.

Date : 14/07/2023 EditionName :
GREATER HYDERABAD PageNo :